www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 13 ఫిబ్రవరి 2023
5
పశ్చిమ గోదావరి



పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి


సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు బీచ్‌కు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో చేరుకున్నారు. సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.



'మండలి'లో.. అడుగు పెట్టేదెవరు..!

16న ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
రెండు స్థానిక సంస్థల స్థానాలకు పెద్దసంఖ్యలో ఆశావహులు
పార్టీలో తొలి నాయకులకు గుర్తింపు దక్కేనా
రేసులో కారుమంచి రమేష్, దిరిశాల కృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 16న వెలువడనుండటంతో పదవి కోసం ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా స్థానిక సంస్థలకు సంబంధించి రెండు ఎంఎల్‌సి స్థానాలకు ఎన్నిక జరగనుంది. ఈ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఎంఎల్‌సి పదవి కోసం ఎవరికి వారు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టనష్టాలు భరిస్తూ ముందుకు సాగుతున్న తొలి నాయకులను గుర్తించి పదవులిస్తారా.. లేక రాజకీయ కోణంలో ఆలోచించి పదవులు ఇస్తారా అనే చర్చ సైతం వైసిపిలో నడుస్తోంది. పదవులు ఆశిస్తున్న వారంతా వైసిపిలో కీలక నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైవి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితోపాటు జిల్లాలోని మంత్రులను కలుస్తూ తమకు అవకాశం ఇప్పించాలని కోరుతున్నారు. నామినేషన్లకు చివరి తేదీ ఈ నెల 23వ తేదీ కావడంతో మరో వారం రోజుల్లో ఎంఎల్‌సి అభ్యర్థుల ఎంపికపై అధికార పార్టీ స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని రెండు ఎంఎల్‌సి స్థానాలు అధికార పార్టీకే దక్కనుండటంతో అధిష్టానం ప్రకటించిన అభ్యర్థులకు పదవి ఖాయమని చెప్పొచ్చు. దీంతో ఆశావహులంతా ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాను పరిగణనలోకి తీసుకుని ఈ పదవులు ఇవ్వాల్సి ఉంటుంది. ఆశావహులు జాబితాలో భీమవరానికి చెందిన గూడూరి ఉమాబాల, గుబ్బల తమ్మయ్య, మేకా శేషుబాబు, పాతపాటి సర్రాజు, వంకా రవీంద్ర, చీర్ల రాధయ్య, గుణ్ణం నాగబాబు, బండి అబ్బులు, యడ్ల తాతాజీ వంటి అనేక మంది నాయకులు ఉన్నారు. అయితే వీరిలో చాలామంది వివిధ కార్పొరేషన్లకు సంబంధించిన ఛైర్మన్ పదవుల్లో ఉన్నారు. ఎన్నికలు జరుగుతున్న రెండు ఎంఎల్‌సి పదవులను గతంలో బిసికి ఒకటి, జనరల్‌కు ఒకటి కేటాయించారు. ఈసారీ అదే తరహాలో కేటాయిస్తారా.. లేక మార్పులు చేస్తారా అనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే డెల్టాలో శాసనమండలి ఛైర్మన్‌గా మోషేన్‌రాజు, ప్రభుత్వ విప్‌గా ముదునూరి ప్రసాద్‌రాజు, ఉప ముఖ్యమంత్రిగా కొట్టు సత్యనారాయణ, మంత్రిగా కారుమూరి నాగేశ్వరరావు ఉండగా డిసిఎంఎస్, డిసిసిబి, జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులన్నీ అటువైపు నాయకులనే వరించాయి. ఈసారి ఈ రెండు ఎంఎల్‌సి పదవులు మెట్ట ప్రాంతానికి ఇవ్వాలని ఇక్కడి నాయకులు పట్టుబడుతుండగా, డెల్టాకు ఒకటి, మెట్ట ప్రాంతానికి ఒకటి ఇవ్వాలనే వాదన సైతం నడుస్తోంది. దీంతో అధిష్టానం ఏనిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

'కారుమంచి'ని గుర్తిస్తారా..?



గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లకు చెందిన కారుమంచి రమేష్‌ను ఈసారైనా వైసిపి అధిష్టానం గుర్తించి ఎంఎల్‌సి పదవి కట్టబెడుతుందా అనే చర్చ నడుస్తోంది. జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచి కారుమంచి రమేష్ కాంగ్రెస్‌ను వీడి వైసిపిని అంటిపెట్టుకునే ఉన్నారు. నల్లజర్ల మండలం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్నప్పటికీ రమేష్ మాత్రం వైసిపిని వీడకుండా ఆదినుంచి క్రియాశీలంగా ఉంటూ వచ్చారు. తన సామాజిక తరగతి అంతా టిడిపిలో ఉన్నప్పటికీ రమేష్ మాత్రం వెనక్కు తగ్గలేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో స్థానిక టిడిపి నాయకులు తీవ్ర ఇబ్బందులకు గురిచేసి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పెట్టినా జంకకుండా పంచాయతీ, ఎంపిటిసి ఎన్నికల్లో కీలకపాత్ర పోషించి వైసిపి అభ్యర్థులచే విజయబావుటా ఎగురవేయించారు. అయితే రమేష్‌కు తగిన గుర్తింపు లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. స్థానిక ప్రాధాన్యత ఉన్న పిఎసిఎస్ ఛైర్మన్ పదవి మాత్రమే ఇచ్చారు. జిల్లాలో రెండు ఎంఎల్‌సి స్థానాలకు షెడ్యూల్ విడుదల కావడంతో కారుమంచి రమేష్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. ఆది నుంచి పార్టీ కోసం కష్టపడిన రమేష్‌ను ఇప్పటికైనా గుర్తిస్తారా లేదా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. కమ్మ సామాజిక తరగతికి చెందిన రమేష్‌కు ఈ పదవి ఇస్తే నియోజకవర్గంలో కూడా పార్టీకి మరింత మేలు జరిగే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. రమేష్ సైతం తన ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

రేసులో దిరిశాల కృష్ణ శ్రీనివాస్



తణుకు నియోజకవర్గం అత్తిలికి చెందిన దిరిశాల కృష్ణ శ్రీనివాస్ సైతం ఎంఎల్‌సి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. శ్రీనివాస్ కూడా పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నవారే. గత ఎన్నికల్లో తణుకు ఎంఎల్ఎ టిక్కెట్ సైతం ఆశించారు. ఉంగుటూరు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకునిగా, ఎన్నికల సమయంలో ఉండి నియోజకవర్గంలోనూ పని చేశారు. వైసిపి ఎన్ఆర్ఐ విభాగంలో కీలకంగా ఉన్నారు. కాపుల కోటాలో శ్రీనివాస్ పదవి ఆశిస్తున్నారు. ఎంఎల్‌సి ఆశావహుల జాబితాలో శ్రీనివాస్ పేరు కూడా ప్రముఖంగా విన్పిస్తోంది.

తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

నేడు సూర్యమిత్ర పరిశ్రమ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో దీక్షలు ప్రారంభం


మాట్లాడుతున్న వెహికల్ డ్రైవర్ యూనియన్ జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి - భీమవరం

సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రయివేట్ లిమిటెడ్ రొయ్యల పరిశ్రమలో తొలగించిన 10 మంది ట్రాలీ డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ది భీమవరం ఏరియా ఆక్వా అనుబంధ వెహికల్ డ్రైవర్ యూనియన్ కార్యదర్శి అల్లూరి అరుణ్ డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం దీక్షలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఎస్‌కె.భాష అధ్యక్షతన డ్రైవర్స్ యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ ఇస్తున్న బేటాలను సూర్యమిత్రా యాజమాన్యం అర్థాంతరంగా నిలుపుదల చేసిందని, అడిగిన డ్రైవర్లను నిర్ధాక్షణ్యంగా తొలగించిందని విమర్శించారు. పరిశ్రమ అభివృద్ధి కోసం 15 సంవత్సరాల నుంచి డ్రైవర్లు పనిచేస్తున్నారని, కనీసం యాజమాన్యం సీనియార్టీని కూడా లెక్కజేయకుండా తొలగించిందని తెలిపారు. సమయంతో సంబంధం లేకుండా డ్రైవర్లు తమ వృత్తి చేస్తున్నారని, ఒక ట్రిప్‌కు వెళితే నాలుగు నుంచి ఐదు రోజులు పడుతుందని, వారి జీతాల్లో కోతలు విధించడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఐదు నెలల నుంచి శాంతియుతంగా పలుమార్లు చర్చలు జరిపినా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని, లేబర్ అధికారులు విధుల్లో తీసుకోవాలని చెప్పినా వారి మాట పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. యాజమాన్యం మొండి వైఖరి పై ఈనెల 13న పరిశ్రమ వద్ద దీక్షలకు దిగుతున్నట్టు తెలిపారు. జిల్లాలో ఉన్న డ్రైవర్లందరూ మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుండా బత్తుల కోటేశ్వరరావు, వి.శ్రీనివాస్ హరీష్, కృష్ణ, కొండయ్య పాల్గొన్నారు.

ఫేస్ అటెండెన్స్ మినహాయించాలని..

14న విఆర్ఎల ధర్నా


మాట్లాడుతున్న విఆర్ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు

ప్రజాశక్తి - భీమవరం


ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయించాలని కోరుతూ భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నెల 14వ తేదీన ధర్నా నిర్వహించనున్నామని విఆర్ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి.సుబ్బారావు, గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్ఎల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కొత్త సమస్యలు సృష్టిస్తోందన్నారు. గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం విఆర్ఎలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిఎను పునరుద్ధరించాలని, నామినీల సమస్యను పరిష్కరించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని అడుగుతుంటే చెవిటివాని చెవిలో శంఖం ఊదినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పుడు ఫేస్ అటెండెన్స్ వేయాలని చెప్పడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఫేస్ అటెండెన్స్ వేయడానికి ఎటువంటి సౌకర్యాలు గాని, వెసులుబాటు గాని విఆర్ఎలకు లేదని, ఆ విషయం ప్రభుత్వానికి, అధికారులకు తెలిసినప్పటికీ ఒంటెద్దు పోకడగా వ్యవహరించడం తగదని అన్నారు. ఇప్పటికైనా విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా ఈనెల 14న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని జిల్లాలోని విఆర్ఎలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

హేక్‌థాన్ పోటీల్లో ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థుల ప్రతిభ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జాతీయస్థాయిలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 24 గంటల హేక్‌థాన్ పోటీల్లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి పదివేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ డేటా సైన్స్‌లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గొంటు నరసింహారెడ్డి, అడ్డాల వెంకటలక్ష్మి శ్రావణి మాట్లాడారు. ఈ కామర్స్‌లో తక్కువ ఖర్చుతో వినియోగదారుడికి వస్తువు చేరే విధంగా రూపొందించిన వెబ్ సైట్‌కు ప్రథమ స్థానం లభించిందన్నారు. ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ.6,000 నగదు అందజేశారు. విశాఖపట్నం అనిట్స్ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులకు ఈ బహుమతి దక్కింది. వారిలో జక్కాల సాత్విక్ భూషణ్, కొంటని గ్రీష్మ, దొమ్మేటి విష్ణువర్ధన్, దొడ్ల సుష్మ, ప్రేమ జ్యోతి కిషోర్, ఎనోక్ వనం బాతిన, మూడో బహుమతి మూడువేల రూపాయలు నగదు బహుమతిని కళాశాల ఐటి విద్యార్థులు సాధించుకున్నారు. ఈ పోటీల్లో భాగస్వామిగా ఉన్న బ్రెయిన్ ఓ విజన్ సంస ప్రతిభ కనబర్చిన 42 మంది విద్యార్థులకు నెల రోజులపాటు ఉచితంగా శిక్షణా కార్యక్రమం అందించుతున్నట్లు ప్రకటించింది. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి రంగరాజు, ఐటి డిపార్ట్మెంట్ హెడ్ బిహెచ్‌విఎస్ రామకృష్ణంరాజు, కోఆర్డినేటర్ ఐ.హేమలత, బ్రెయిన్ ఓ విజన్ వ్యవస్థాపకులు, సిఇఒ డి.గణేష్ నాగ్, కన్వీనర్ కిషోర్ రాజు పాల్గొన్నారు.


కొయ్యే మోషేన్‌రాజును సత్కరిస్తున్న సభ్యులు

వెనుకబడిన వర్గాలకు పెద్దపీట

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

ప్రజాశక్తి - ఉండి

వెనుకబడిన వర్గాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఛైర్మన్ మేడిది జాన్సన్ అన్నారు. శనివారం ఉండి పెదపేటలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కొయ్యే మోషేనురాజు, మేడిది జాన్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆర్థికంగా సామాజికంగా బలమైన వారిని గుర్తించి వారికే అగ్రతాంబూలం ఇచ్చేవారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత నుంచి రాజకీయంగా కనీస గుర్తింపు లేని ఎన్నో సామాజిక వర్గాల వారికి ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో అన్ని కులాలకూ గుర్తింపునిచ్చి వారి పురోభివృద్ధికి కార్పొరేషన్లను ఏర్పాటు చేసి క్యాబినెట్ హోదాతో సమానంగా ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమించారన్నారు. గత ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాలకు చెందిన వారిని కేవలం ఓటు బ్యాంకు గానే ఉపయోగించుకునే వారని తెలిపారు. ఎస్‌సిలను గుర్తించి శాసనమండలి ఛైర్మన్ పదవిని కట్టబెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎప్పుడు రుణపడి ఉంటామన్నారు. క్రైస్తవుల కోసం ప్రతి గ్రామ పరిధిలోనూ ఎకరం భూమిని శ్మశాన వాటిక కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేసిందన్నారు. ఎస్‌సిలను గుర్తించి వారి పురోభివృద్ధికి దూరం చేస్తున్న జగన్మోహన్ రెడ్డికి తామంతా తోడుగా ఉంటామని తెలిపారు. అనంతరం సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి కార్యదర్శి చిట్టూరి జోషి, గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి కళ్యాణ్ వర్మ, చర్చి పెద్దలు కొయ్యే మోషేన్ రాజు, మేడిది జాన్సన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మోతిలాల్, అద్దంకి పేతురు, మాంద్రు లాజర్, కాట్రగడ్డ రవి, కాటిక శాంతారావు, గాతల జాన్, చిట్టూరి రత్నరాజు, వాసుపల్లి విజయ్ కుమార్, ఉండ్రు అబ్రహం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి

ఉపాధ్యాయులకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపు


మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో కృషి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ ఏలూరు జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం స్థానికంగా ఆదివారం జరిగింది. సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పని ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం చేస్తుందని విమర్శించారు. పాఠశాలల సంఖ్యను కుదించడం, ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించడం లక్ష్యంగా జిఒ.117ను ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాల్సిందిపోయి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని చెప్పి పాఠశాలలను విలీనం చేయడాన్ని యుటిఎఫ్ వ్యతిరేకిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని పెంచడం ద్వారా నాణ్యమైన విద్య ఎలా వస్తుందో ప్రభుత్వం చెప్పాలని కోరారు. ఉపాధ్యాయులను తగ్గించడం ద్వారా నాణ్యమైన విద్య రాకపోగా విద్యార్థుల సంఖ్య తగ్గడానికి, డ్రాపౌట్స్ పెరగడానికి కారణమవుతుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విద్యాశాఖాధికారులు పాఠశాలలను సందర్శించడాన్ని స్వాగతి స్తున్నామని, ఉపాధ్యాయుల నుంచి గమనించిన లోపాలను సరిదిద్దే విధంగా ఆ సందర్శన ఉండాలని కోరారు. ఏదేమైనా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు తగ్గించి, బోధనకు సమయం కేటాయించేట్లు ప్రభుత్వ చర్యలు ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు కోరితే ఉపాధ్యాయులపై కేసులు పెట్టడం ఎలాంటి ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సదస్సులు, సమావేశాలు పెట్టుకోవడానికీ అనుమతి ఇవ్వకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సిపిఎస్ లేదా జిపిఎస్‌ను అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ 30 రోజులు పని చేయించుకుని ఒకటో తేదీన జీతం చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని, గడిచిన రెండు సంవత్సరాలుగా ఒకటో తేదీ జీతం చెల్లించడం లేదని విమర్శించారు. ఆర్థిక పరిస్థితి గాడిలో పడిందని ఒకసారి, ఆర్థిక పరిస్థితి బాగుండలేదని మరోసారి చెప్పి ఉద్యోగ, ఉపాధ్యాయులను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిపై ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, అసోసియేట్ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి షేక్ ముస్తఫాఆలీ, జిల్లా కార్యదర్శులు పివి.సాగర్‌బాబు, పి.వీరకోటి, ఎంవి.అప్పారావు, ఎన్.రాంబాబు, ఎస్. సుధారాణి, జి.రాజేంద్రప్రసాద్, అల్లాడి రాజు, బివి.రవీంద్ర పాల్గొన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఎగురవేయగా, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ, యుటిఎఫ్ పతాకాన్ని సిహెచ్.జగన్మోహన్‌రావు ఆవిష్కరించారు.


ఎంఎల్‌సి షేక్ సాబ్జీ


రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఇదే

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఆర్.రవికుమార్, పివి.నర్సింహారావు మళ్లీ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఎంవి.శ్యాంబాబు, సహాధ్యక్షురాలిగా బి.సుభాషిణి, సహాధ్యక్షునిగా జి.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్‌కె.ముస్తఫాఆలీ, కార్యదర్శులుగా ఎ.విక్టర్, పివి.సాగర్‌బాబు, బి.బాలకృష్ణ, పి.వీరకోటి, ఎంవి.అప్పారావు, బి.అనురాధ, ఎన్.రాంబాబు, జి.రాజేంద్రప్రసాద్, ఎస్.సుధారాణి, ఇ.శివశంకరరావు, సిహెచ్.శ్రీధర్, జి.దేవానంద్, కె.కమల్‌కుమార్ ఎన్నికయ్యారు.

ఆశాలను కార్మికులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - కాళ్ల

ఆశాలను కార్మికులుగా గుర్తించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దిగుబాటి జ్యోతి అన్నారు. కాళ్లలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ మండల అధ్యక్షురాలు రెడ్డి దేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పనిబారం తగ్గించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, అధికారుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను ఆశా వర్కర్లకు అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13వ తేదీన సోమవారం భీమవరంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, ఆశా వర్కర్స్ మండల కార్యదర్శి పెద్ది బోయిన కృష్ణవేణి, కోశాధికారి ఎన్.రేవతి, వి.పైడితల్లి, యు.రజిని, ఇ.లక్ష్మి, సిహెచ్.చిట్టి పాల్గొన్నారు.

ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆకివీడు

ఈ నెల 25, 26వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నంద్యాల సుబ్బారావు స్మారక భవనంలో మండల కార్యనిర్వాహక కార్యదర్శి తోట రామకృష్ణ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ కార్మిక చట్టాల, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారన్నారు. ఆంధ్రుల జీవనాడి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కారు చవుకగానూ, ప్రభుత్వ రంగంలో ఉన్న సంస్థలు బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, రైల్వే స్టేషన్లు, విమానయానం, ఓడరేవులు అమ్మేస్తున్నారన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న హమాలీ కార్మికులకు, మోటార్ రవాణా వర్కర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతంలో రైస్ మిల్ వర్కర్స్‌కు పూర్తిస్థాయిలో పని ఉండడం లేదని వారికి పని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు పి.శ్రీను, జి.ఆంజనేయులు, జె.హనుమంతు, ఎ.సత్యనారాయణ, ఎస్.కాశి, సిహెచ్ రమేష్, బి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

14న ర్యాలీకి అనుమతి లేదు : డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 14న పాలకొల్లులో కొందరు తలపెట్టిన ర్యాలీకి ఎటువంటి అనుమతులు లేవని నరసాపురం డిఎస్‌పి మనోహర్ తెలిపారు. ఆదివారం పాలకొల్లు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6న పాలకొల్లులో కొంతమంది నిర్వహించిన ర్యాలీలో మతపరమైన ఆరోపణలపై తమకు ఫిర్యాదు చేశారని, దీనిపై లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్నట్లు చెప్పారు. వారి ఆరోపణలకు వ్యతిరేకంగా ఈ నెల 14న పాలకొల్లు హౌసింగ్ బోర్డు నుంచి పలువురు భారీ ర్యాలీ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎంఎల్‌సి ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ర్యాలీలకు, సమావేశాలకు ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు బాదం శ్రీనివాస్, ముత్యాలరావు పాల్గొన్నారు.


రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

రోటరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు

రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి ఆధ్వర్యంలో చవాకుల ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం రైల్వే గేటు వద్ద ఉచిత రక్త పరీక్షా శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మందికి పైగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో క్లబ్ అధ్యక్షులు చవాకుల నరేష్‌బాబు, కార్యదర్శి కుంపట్ల రాజగోపాల్, కోశాధికారి ఇనుకొండ శేషాద్రి, తలుపుల శ్రీనివాస్, దుగ్గిన రాము పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు

గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల లోను ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశం ఎం.మోజేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పునాది దశలో నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నిర్మాణానికి నోచుకోని నిరుపేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, బొంతు శ్రీను పాల్గొని మాట్లాడారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


లోగోను ఆవిష్కరిస్తున్న సభ్యులు

26న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకులోని శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ (ఎస్‌సిఐఎం) కాలేజీ 1938 - 86 బ్యాచ్ బిఎ విద్యార్థులు తణుకు ఎన్‌జిఓ హోంలో ఫిబ్రవరి 26వ తేదీ ఆదివారం సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ అపూర్వ కలయికకు మంచి స్పందన రావడంతో తొలి ప్రయత్నంగా ఆదివారం ఎన్‌జిఓ హోమ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి లోగోను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 37 సంవత్సరాల తర్వాత తమ విద్యార్థులు కలుసుకోవాలని చేసిన చిన్న ప్రయత్నానికి మంచి స్పందన లభించిందన్నారు. అందుకే లోగోను ఆవిష్కరించామన్నారు. ఈ నెల 26వ తేదీన సమావేశం కోసం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఉత్సాహం చూపిస్తున్నారని తెలిపారు. అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఈ అపూర్వ కలయికను జయప్రదం చేసేవిధంగా బ్యాచ్ విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జాయింట్ కమిటీ కార్యదర్శి ఆర్‌ఎస్ హరినాథ్, ఆర్.కృష్ణసాయి, న్యాయవాది కామన మునిస్వామి, ఎన్.రాధారాణి, కె.వెంకటేశ్వరరావు, పి.బాపిరాజు పాల్గొన్నారు.

పెనుగొండలో రాష్ట్రస్థాయి పోటీలు

పెనుగొండ : శ్రీచివటం సత్యనారాయణ నాగరత్నం స్మారక కళా పరిషత్ పెనుగొండ వారు స్థానికంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సంగీత పోటీల్లో వివిధ జిల్లాల నుంచి పలువురు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. కన్సలేషన్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోటేశ్వరరావు, కె.సింధు, గుండాల మహాలక్ష్మి, జివికె.మల్లికార్జునరావు, ఆచార్య రంకిరెడ్డి రామ్మోహనరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పాలకోడేరులో కారు బీభత్సం

అతివేగంతో బైక్‌ను ఢీకొట్టిన వైనం

నలుగురికి తీవ్ర గాయాలు - ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి -పాలకోడేరు

పాలకోడేరులో కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వెళ్లి మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. వెనుక నుంచి వస్తున్న మరో కారు మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టిన కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం నుంచి పాలకోడేరు వైపు వెళ్తున్న కారు కుముదవల్లి రోడ్డులోని అమ్మా మెస్ సమీపంలో పాలకోడేరు నుంచి భీమవరం వైపు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే సమయంలో భీమవరం నుంచి పాలకోడేరు వైపు వెళుతున్న మరొక కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన కారును వెనుక నుంచి వేగంగా ఢీ కొట్టింది. ఈ నేపథ్యంలో కారు అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన నలుగురిని స్థానికులు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా జరిగిన రోడ్డు ప్రమాదం అందరిని భయభ్రాంతులకు గురి చేసింది. పాలకోడేరు కుముదవల్లి రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కారు ఢీకొని బాలుడికి గాయాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రోడ్డు దాటుతున్న బాలుడిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడు గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భీమవరం గ్రామీణ మండలం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన బాలుడు మండలంలోని ముత్యాలపల్లి గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన బాలుడిని స్థానికులు భీమవరంలోని ఆసుపత్రికి తరలించారు.

ప్రణాళికతో కూడిన విద్యనందిస్తున్నాం

ఎంఇఒ ఎ.రవీంద్ర

చిట్ చాట్



ప్రజాశక్తి - కాళ్ల

పదో తరగతి ఉన్నత విద్యకు తొలిమెట్టు అని ఎంఇఒ ఎ.రవీంద్ర తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యతా ప్రమాణాలతో విద్యా బోధన సాగుతుందన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నాయని, ఇప్పటి నుంచే పాఠశాలల్లో సమయపాలనకు అధిక ప్రాధాన్యతిస్తూ విద్యార్థులకు ప్రణాళికతో కూడిన విద్యనందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ రవీంద్ర ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రశ్న : మండలంలో ఎంతమంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు?

మండలంలో ఈ సంవత్సరం తొమ్మిది ప్రభుత్వ హైస్కూళ్లు, రెండు ప్రయివేటు పాఠశాలల నుంచి మొత్తం 635 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న : ఉత్తమ ఫలితాల సాధనకు మీరు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ప్రతి పాఠశాలలో ఉదయం, సాయంత్ర సమయాల్లో అదనంగా గంట చొప్పున నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారు?

విద్యార్థులకు సబ్జక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించి ప్రత్యేక రివిజన్ క్లాసులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : పది పరీక్షా ఫలితాల్లో గతేడాది ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారు?

గత సంవత్సరం 68 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ఉదయం, సాయంత్రం రివిజన్ చేయించడం, వెనకబడిన పిల్లలకు ప్రత్యేక మెటీరియల్‌తో తర్ఫీదు ఇస్తున్నాం.

ప్రశ్న: ఉచిత స్టడీ మెటీరియల్, మోడల్ టెస్ట్ పేపర్స్ విద్యార్థులకు అందించారా?

కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశాం. మిగిలిన విద్యార్థులకు త్వరలో అందజేస్తాం.

ప్రశ్న : వెనుకబడిన విద్యార్థులపై తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఒక్కో టీచరుకు ఆరుగురు విద్యార్థుల చొప్పున బాధ్యతలు అప్పగించాం. విద్యార్థుల తల్లీదండ్రులకు ఫోన్ చేసి పిల్లలు చదువుతున్నారా లేదా అని ఉపాధ్యాయులు తెలుసుకుంటున్నారు. ఏమైనా సందేహాలుంటే ఫోన్లో నివృత్తి చేస్తున్నారు.

ప్రశ్న:మండలంలో నాడు -నేడు నిధులు పేజ్-2 లో నిర్మాణ పనులు ఎన్ని పాఠశాలలో జరుగుతున్నాయి?

నాడు - నేడు ఫేజ్-2లో మండలంలో 32 ప్రభుత్వ పాఠశాలలు, ఒక అంగన్వాడి భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.10 కోట్ల 50 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు జరుగుతున్నాయి.

మహాశివరాత్రికి ఆచంటేశ్వర ఆలయం ముస్తాబు

16 నుంచి 20వ తేదీ వరకూ కళ్యాణోత్సవాలు - యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఆచంట

మహాశివరాత్రి సందర్భంగా ఆచంటలో కొలువైన ఆచంటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లూ చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకూ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ వెలుపల చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. స్వామివారి ఆలయంతో పాటు కచేరీ సెంటర్ నుంచి స్వామి వారి సత్రం వరకూ ఆచంట - కోడేరు ఆర్‌అండ్‌బి రహదారి వెంబడి విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. ముఖద్వారం వద్ద యాత్రికులను ఆకర్షించే విధంగా భారీ విద్యుత్ సెట్టింగులు చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ శనివారం మహాశివరాత్రి సందర్భంగా యాత్రికులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున స్వామివారి దర్శనంలో యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు.


ఆచంట రామేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ

ఐదు రోజులపాటు అన్నదానానికి ఏర్పాట్లు

ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులపాటు యాత్రికులకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఏటా అన్నదానం నిర్వహిస్తారు. ఈ మేరకు అన్నదాన కమిటీ ఏర్పాట్లు చురుగ్గా చేస్తోంది. గ్రామ పంచాయతీ వైద్యారోగ్య శాఖ అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించారు.

ఉత్సవాల్లో కార్యక్రమాలు ఇవే..

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులపాటు స్వామి వారికి ప్రతిరోజూ ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, ఆలయ కార్య నిర్వహణాధికారి ఆర్‌బివిఎస్ రామచంద్ర కుమార్ తెలిపారు. అన్ని రోజులూ సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఉపాధ్యాయుల పట్ల వివక్ష తగదు

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని, ఇది సరైంది కాదని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ విమర్శించారు. శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్‌టియు జిల్లా 76వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడమే కాకుండా అణచివేతకు గురి చేస్తోందన్నారు. జీతాలు కూడా ఒకటో తేదీన చెల్లించకుండా వేధించడం సరికాదని విమర్శించారు. జిఒ 117, 128ని తీసుకొచ్చి ప్రతి సెక్షన్‌కూ 60 మంది విద్యార్థులను ఉంచడం ఉపాధ్యాయులకు 36 పీరియడ్లు వర్క్ లోడ్ పెంచడం దుర్మార్గమన్నారు. సింగిల్ మీడియంగా కొనసాగించడం వల్ల ఉపాధ్యాయుల్లో తీవ్రమైన వర్క్‌లోడ్ పడిందని చెప్పారు. నాలుగు సంవత్సరాలుగా డిఎస్‌సి నియామకాలు లేవని, ఉద్యోగోన్నతులు శాశ్వత ప్రాతిపదిక కాకుండా వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా నిర్వహించడం దారుణం అన్నారు. బదిలీ నిబంధనలు అసంబద్ధంగా ఇవ్వడం వల ఉపాధ్యాయులు వేలాదిగా కోర్టులను ఆశ్రయించడానికి ప్రభుత్వమే కారణమని విమర్శించారు. వీటిని సవరించడానికి త్వరలోనే ఎస్‌టియు ద్వారా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని వెంటనే నియమించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు జవహర్‌రాజు మాట్లాడుతూ పిఎఫ్ లోన్లు పెట్టి సంవత్సర అయినా చెల్లింపులు జరపట్లేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం డిఎ బకాయిలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి వి.జనార్దన్‌రావు మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్మెంట్ కారణంగా ఉపాధ్యాయులు వందల కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పాండురంగారావు, ఎం.మహంకాళి, జిల్లా నలుమూలల నుంచి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో మంచినీటి కొరత

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

ప్రజాశక్తి - పెంటపాడు

ఒకే ప్రాంగణంలో ఎనిమిది ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా అక్కడకు పలు అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలకు తాగునీరు దొరకని పరిస్థితి నెలకొంది. పెంటపాడు మండలంలో 22 గ్రామాల ప్రజలు నిత్యం మండల పరిషత్ కార్యాలయాలకు వస్తూ ఉంటారు. ఇక్కడ ఎంపిడిఒ, తహశీల్దార్, విద్యాశాఖ, హౌసింగ్, వ్యవసాయ శాఖ, మండల డ్వాక్రా సంఘ భవనం, రెవెన్యూ శాఖ సంబంధించి సర్వే డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఇక్కడ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది ప్రజలు పలు అవసరాల నిమిత్తం వస్తూ ఉంటారు. కార్యాలయాల వద్ద తాగునీరు లేకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడంలో ఇక్కడి అధికారులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం అదే ప్రాంగణంలో ఉన్నా ఆ శాఖ వారు కూడా ఇక్కడ మంచినీటి సౌకర్యం కల్పించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో గతంలో ఒక బోరు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం అది పని చేయడంలేదు. అనంతరం రూ.లక్షలు వెచ్చించి మంచినీటి చెరువును తవ్వించారు. అదీ నిరుపయోగంగా మారింది. మండల పరిషత్ కార్యాలయంలో సుమారు మూడు దశాబ్దాల నుంచి ఈ మంచినీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎంపిడిఒను వివరణ కోరగా ఇది పంచాయతీకి సంబంధించిన విషయమని, ఈ సమస్యను వారే పరిష్కరించాలని చెప్పారు. పెంట పాడు పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా త్వరలో పైపులైను నిర్మాణం చేపట్టి మంచినీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

యాత్రికులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

శివరాత్రి మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించిన డిఎస్‌పి శ్రీనాథ్

ప్రజాశక్తి- ఉండి

శివరాత్రి మహోత్సవం సందర్భంగా ఉండి శ్రీ పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ సూచించారు. శివరాత్రి మహోత్సవ కరపత్రాలను ఉండి శివాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ ఆలయ అర్చకులు సన్నిధిరాజు చలపతిరావు, శేషగిరిరావు ఆహ్వానం మేరకు దేవాలయానికి వచ్చినట్లు తెలిపారు. ఈ దేవాలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకోవడం, కరపత్రాలను ఆవిష్కరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ ఉండి శివాలయంలో మహాశివరాత్రి కరపత్రాల ఆవిష్కరణకు డిఎస్‌పి బి.శ్రీనాథ్ రావడం ఎంతో అభినందనీయమని వారు కొనియాడారు. ఆలయ అర్చకులు చలపతిరావు మాట్లాడుతూ డిఎస్‌పి శ్రీనాథ్ ఉద్యోగోన్నతి పొంది ఆయన సేవలు మరింత మందికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి రుద్రరాజు ఫణి కిషోర్ వర్మ, ఆలయ కమిటీ సభ్యులు శేషాద్రి శ్రీనివాసరావు, మండా రత్నమాణిక్యం, మంతెన వెంకట్రాజు, ముద్రపల్లి వెంకట విజయలక్ష్మి, ఆకుల సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు భేష్

వెంకట్రామరాజు సొంత గ్రామం కాళ్లకూరు అభివృద్ధికి కృషి

పలువురి అభినందనలు


కాళ్లకూరు శ్మశాన స్థలంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అధినేత వెంకట్రామరాజు పలు అభివృద్ధి పనులు చేపడుతూ అందరితో శభాష్ అనిపించుకుంటూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. కాళ్లకూరు మేజర్ పంచాయతీలో అధ్వానంగా మారిన శ్మశానస్థలం, క్రిస్టియన్ పేటకు వెళ్లే వంతెన, కల్వర్టు అభివృద్ధి పనులకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట్రామరాజు నడుం బిగించారు. సొంత గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో, గ్రామస్తులకు మంచి కార్యక్రమాలు చేయాలనే దృక్పథంతో ట్రస్టును ఏర్పాటు చేశారు. తన కుమార్తె అకాల మరణం చెందడంతో 2022 సెప్టెంబర్ 4వ తేదీన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ పేరుతో ట్రస్టును ఏర్పాటు చేశారు. కాళ్లకూరు గ్రామంలో గ్రామ ప్రజలు విపత్కర సమయంలో కర్మకాండలు జరుపుకునేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. రెండు దహన గదుల షెడ్డులు, రెండు రేవులు, మూడు వైపులా ఇనుప వైర్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.18 లక్షలతో చేపట్టారు. క్రిస్టియన్ పేటకు వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు వంతెన అభివృద్ధి పనులు రూ.నాలుగు లక్షలతో చేపట్టారు. మేరీమాత గ్రౌండ్‌ను నిర్మల మేరీ మాత ఉత్సవం సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. కాళ్లకూరు వెంకటాపురంలో లావేటి కన్నంనాయుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. లావేటి కన్నంనాయుడుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు పరామర్శించారు. తన వంతు సాయంగా రూ.ఆరు వేల నగదును అందించారు. గ్రామంలో ఆరు ప్రాంతాల్లో 20 సిమెంట్ బెంచీలను ట్రస్టు ద్వారా ఏర్పాటు చేశారు.


సిమెంట్ బెంచీలు ఏర్పాటు

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

దాట్ల వెంకట్రామరాజు, ట్రస్ట్ వ్యవస్థాపకులు



గ్రామంలో శ్మశాన స్థలం అధ్వాన స్థితిలో ఉండేది. వర్షం వస్తే చాలు మునిగిపోయేది. ఆ పరిస్థితి చూసి మోక్షధామం ఆధునీకరణ పనులు రూ.18 లక్షలతో చేపట్టాం. మరో రూ.పది లక్షల వ్యయంతో పలు నిర్మాణాలు ప్రారంభించాం. శ్మశాన రోడ్లు అభివృద్ధి చేస్తాను.



చిత్రకళా ప్రదర్శనలో వెంపటాపు ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉభయ తెలుగు రాష్ట్రాల చిత్రకారుల చిత్రకళా ప్రదర్శన విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం నిర్వహించినట్లు చిత్రకారుడు వెంపటాపు తెలిపారు. రాష్ట్ర దృశ్య కళల అకాడమీ ఛైర్మన్ కుడిపూడి సత్యశైలజ, జెఎన్ ఫైన్ ఆర్ట్స్ కాజేజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందరకుమార్, ఏమినెంట్ ఆర్టిస్టులు దాకోజు శివప్రసాద్, శేషబ్రహ్మం, 64 కళలు డాట్ కామ్ ఎడిటర్ కళాసాగర్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు ఎ.అంజి చిత్రకళా ప్రదర్శన ప్రారంభించి, చిత్రకారులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి పండిత శాలువాతో సత్కరించారని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల 45 మంది చిత్రకారులు చిత్రకళా ప్రదర్శన నిర్వహించారన్నారు. క్రియేటివ్ హార్ట్ అకాడమీ ఈ ప్రదర్శన మాస్టర్ స్ట్రోక్-2 పేరుతో నిర్వహించారన్నారు. తాను ప్రదర్శించిన చిత్రం పలువురి ప్రశంసలు అందుకుందని తెలిపారు. ఈ సందర్భంగా తణుకు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎస్‌వి.ప్రసాద్, టి.ఉమా, జిజె.ప్రభువరం, వీరభద్రం పలువురు వెంపటాపును అభినందించారు.

నేడు ముత్యాలమ్మ దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం ఈనెల 13వ తేదీ సోమవారం లెక్కించనున్నామని ఆలయ కార్య నిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ లెక్కింపులో పాల్గొనేవారు ఆలయ ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు ఉండాలని సూచించారు.

తుందుర్రులో ఘనంగా జాతర

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని తుందుర్రు గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ, మారమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా మూడో రోజు ఆదివారం అమ్మవారి గరగల ఊరేగింపును నిర్వహించారు. ఈ ఊరేగింపులో గరగ నృత్యాలు, మేళతాళాలతో, బాణసంచా కాల్పులతో కోర గేదెలు, బుట్ట బొమ్మలు, కాంతారావు కథాకళి, శక్తి వేషాలు, కోయ డాన్సులు, తీన్‌మార్ డబ్బులతో అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్లకు ఊయల సేవ, రాత్రి కోలాటం నృత్య ప్రదర్శన, సంగీత విభావరిని నిర్వహించారు.

టిడిపి మండల అధ్యక్షునికి మాతృవియోగం

ప్రజాశక్తి - పాలకోడేరు

టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు (కోటిరాజు)కు మాతృ వినియోగం కలిగింది. కోటి రాజు తల్లి సుబ్బమ్మ (95) వృద్ధాప్యంతో మృతి చెందింది. పాలకోడేరు గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు దెందుకూరి సుబ్బరాజు భార్య సుబ్బమ్మ శనివారం రాత్రి మృతి చెందారు. సుబ్బమ్మ భౌతికకాయాన్ని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఆదివారం సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాలుగో కుమారుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు టిడిపి పాలకోడేరు మండల అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. సుబ్బమ్మ మృతి పట్ల టిడిపి మండల నాయకులు సాలమల్లేశ్వరరావు, మాధవరావు, డి,కృష్ణ పలువురు సంతాపం తెలిపారు.

జుత్తిగలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - పెనుమంట్ర

జుత్తిగ గ్రామ శివారులో మావుళ్లమ్మ జాతర 17వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించినట్లు దేవస్థానం నిర్వాహకులు తమనంపూడి వీర్రెడ్డి తెలిపారు. అమ్మవారిని సుమారు 25 వేల మంది యాత్రికులు దర్శింకుకున్నారని తెలిపారు. యాత్రికులందరికీ భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, నిర్వాహకులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకులు తమనంపూడి వీర్రెడ్డి, సేవకులు కొవ్వూరి సూర్రెడ్డి, కొవ్వూరు కోదండ రామ వెంకటరెడ్డి, సత్తి వెంకటరెడ్డి, తమనంపూడి వెంకటరెడ్డి, కర్రీ బుల్లి సోమిరెడ్డి, తమనంపూడి సోమిరెడ్డి, నల్లిమిల్లి సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని కాళీపట్నం పడమరలోని కాళికాంబ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ మీనాక్షి దంపతులు ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.